# లక్ష్మి

శ్రీమతి ఆర్. అలివేలుమంగాదేవిగారు

'రాష్ట్రభాషా విశారద'



ఆ సందు చాలా యిరుకైంది. దానికి రెండువేపులా చిన్నచిన్న తాటాకులపాకలు. రోడ్డుప్రక్క నిలిచిన మురిగిననీరు దుర్గంధం ఆ ప్రదేశాన్నంతా నింపేసింది. పైగా ప్రతియింటిముందూ పెంటకుప్పలు పోసి వున్నాయి. అక్కడక్కడ ఆ గుడిసెల్లో నుంచి తల్లులు దగ్గిరలేని పిల్లల ఆక్రందనాలు వినబడుతున్నాయి. ఆ కార్మికవాటిలో తొమ్మిదిగంటలవేళ ఆకలికడుపుతో ఆయాసంతో, అన్నం లేక అలమటించే తన పిల్లల దీనారవాన్ని ఊహించుకుంటూ మెల్లిగా నడిచి పోతోంది లక్ష్మి.

లక్ష్మిభర్త రామలింగం ఫాక్టీదార కర్మాగారంలో కూలీ. అలసట తీరటానికని ఆరంభించిన మద్యపానం మహావ్యసనంగా పరిణమించి అతన్నీ అతని కుటుంబాన్నీకూడా నాశనం చేసేసింది. ఆ పానపిశాచానికి ఎంతయినా చాలదు.

నడిచినడిచి లక్ష్మి తనయిల్లు జేరుకుంది. అడుగుల చప్పుడు విని అమ్మ యేదో తెస్తుందన్న ఆశతో 5 సం.రముల పిల్లడు—లక్ష్మి పెద్దకొడుకు—చాలా ఆతురతగా బయటికి వచ్చి, తల్లి వట్టిచేతులవంక దీన దృష్టితోచూపి, అమ్మా! తింటానికి యేమయినా తెస్తానన్నావుగా తేలేదేల? అన్నాడు. ఆకలితో యేడ్చి యేడ్చి రొండిపోయిన వాడి దీనస్వరం లక్ష్మి మాతృహృదయంలో మారుమోగింది. అసలే నీరసంగా వున్న ఆమెకు మరింత నీరసం తోచింది. ఆ పిల్లవాడి దృష్టి ఆకలిమీదనుంచి మళ్లించాలని "బాబూ! ఊయ్యాలలో మీతమ్ముడు నిద్రపోతున్నాడో లేదో చూడూ!" అంది. అంతలోనే గుడ్డతొట్టిలో పాప పాలకోసం యేడవటం మొదలెట్టేడు. లక్ష్మి ప్రసవించి రెండునెలలయింది. తగినఆహారం వైద్యసహాయం లేక అవిడ శరీరం గుల్లవిడిచి నీరగించిపోయింది. ఆ పసిపాప ఆకలితీర్చడానికి ఆ శుష్క స్తనాల్లో పాలులేవు. ఆ దరిద్రగృహంలో అంతకన్నా లేవు. ఏడ్చిఏడ్చి నిస్త్రాణతో ఆ పసిపాప పడుకున్నాడు. వాడూరుకోటంతోటే వాణ్ణి జూస్తూ తనఆకలిమరిచిన పెద్దవాడు రోదనం మొదలెట్టేడు.

లక్ష్మి తలగిర్రున తిరిగిపోయింది. అక్కడకి కొద్దిదూరంలోనే ఆమెతండ్రిగారియిల్లుంది. అతడు 70 యేళ్ల వృద్ధు. అతనికి 5 రు. ఫించను వస్తుంది.

దాంతో జీవనం. శరీరంలో ఆరోగ్యంలేక ఆమె ఫ్యాక్టరీలో పనికిపోవటం లేదు. ఆమెభర్త తెచ్చేది అతని తాగుడుకే చాలదు. ఆమె ప్రసవించటానికి ముందు 5 రోజులు కూలి రావాలి ఫ్యాక్టరీనుంచి.

తండ్రిగారి యింటిదగ్గర యేమయినావుంటే అది తెచ్చి ఆకలితీర్చి ఫ్యాక్టరీకి పోదామని తండ్రి దగ్గిరకు పోయింది. ఆ డెబ్బయ్యేళ్ల ముదసలి కాటికి కాళ్లు చాచుకున్న వృద్ధుదగ్గిర యేమీలేదు. గత్యంతరంలేక ఇక ఫ్యాక్టరీకి పోవటానికి నిశ్చయించుకుంది. వంట్లో నిలబడడానికే ఓపికలేదు. మైలుదూరానవున్న మిల్లుకి ఎట్లాపోతుందో! ఆవిడలో మాతృప్రేమ ఆమెకు బలమిచ్చింది.

మెల్లిగా చీమపాకినట్లు పాకి లక్ష్మి ఫ్యాక్టరీ చేరుకుంది. అది చాలా పెద్దఫ్యాక్టరీ. అక్కడ చాలా మంది కూలీలు పనిచేస్తున్నారు. యితర దృష్టిలేని ఆ కార్మికులను చూస్తే వీళ్లూ యంత్రాలయిపోయినారా అనిపిస్తోంది. ఆ కర్మాగారంలో ఒకప్రక్క మేడ మీద ఒక పెద్దగదిలో ఉంటాడు ఆ మిల్లు మేనేజరు. స్వంతదారు అయిన బైరాంషా. లక్ష్మి రోజుకుంటూ ఆ మేడ మెట్లెక్కింది అతని గదికి పోయింది.

ఆగది చాలా అలంకరించివుంది. బల్లమీద ఉన్ని గుడ్డ. దానిమీద వెండికూజాలో పువ్వులు. దాని మీద రంయిమని తిరిగే ఎలెక్ట్రిక్ ఫాను. ఆమహా భోగికీ తనకీవున్న అంతరం తల్చుకుంటే లక్ష్మికి మతి పోయి నోటివెంట మాటరాలేదు. కాని యెల్లాగో జోరుచేసుకుని అతనికి నమస్కరించి నిలబడి "బాబూ నేను కానుపుతో నెల్లాళ్లనుండి పనిలోకి రావటం లేదు. నాకు వెనకనెలలో రావలసినకూలి యిప్పించండి. ఇంట్లో పిల్లలు నేను అల్లాడిపోతున్నాము" అన్నది.

అరవైయేళ్లు దాటిన ఆ పారసీ యజమానికి అప్పటికీ కామకాంక్ష విడువలేదు. బక్కచిక్కినా కార్మికద్యుతి పోని లక్ష్మి పాలచెక్కిళ్లు అతని మనస్సును చలింపజేసినయి. వెండిఫ్రేము కళ్లజోడిలగుండా ఒక తీవ్రదృష్టి విసరి "నీ పేరేమిటి" అన్నాడు. "లక్ష్మి" అన్నది లక్ష్మి ఆశతో! సేట్ "దగ్గిరకురా! అట్లా దూరంగా వుండి మాట్లాడితే నాకు యెట్లా తెలుస్తుంది? నేను చెప్పినట్లు వింటే నీవు ఏది కోరితే అది యిస్తాను" అన్నాడు.

అమాయిక అయిన లక్ష్మికి అతనేదేదో అర్థం కాలేదు.

"మేము తమ సేవకులము. తమ ఆజ్ఞను శిరసా వహిస్తాము" అన్నది మెల్లిగా.

"అయితే యిల్లారా" అని లక్ష్మి చేయిపట్టుకున్నాడు సేట్ ఒకచేత్తో మెల్లిగా తలుపువేస్తూ.

లక్ష్మికి అప్పటికి అతనిదురంతం మెదడుకు తట్టింది. త్వరగా అతనిచేతిని విడుపించుకుంటూ "చక్కా చేయంవదులు! నేను నీకు కూతురులాంటిదాన్ని, తల నెరిసింది. బుద్ధిపక్వానికి రాలేదు." అంది. సేట్ వుగ్రుడై "కూలీదాని కింత పొగరా! నీ బ్రతుకు నాచేతులో వుంది" అని బలాత్కరింపపోయినాడు. భీతహరిణంలాగా లక్ష్మి అరవబోయింది.

అంతలో ఆ తలుపు తెరుచుకుని ఊళ్లో వర్తకుడు సూర్యారావు సేట్ బాకీ తీర్చటానికి వచ్చాడు. తలుపు తెరవంగానే అతనికా దురంతం కళ్లబడింది. అతన్ని జూట్టంతోటే సేట్‌పై ప్రాణాలు పైనపోయినయి. సూర్యారావు అతన్ని దూషించి లక్ష్మిని బయటికి తీసుకెళ్లాడు. ఫరవాలేదని ఆమెను వోదార్చి ధైర్యంచెప్పాడు.

ఆ కార్మికయువతి దీనత్వం ఆ సంపన్నుని దుర్మార్గం అతనిలో విపరీతమయిన పరివర్తన కలిగించింది. అతనిలో నిద్రపోతూన్న సామ్యవాదం మేలుకుంది. కార్మికులకోసం తనజీవితాన్ని ధారపోయాలని నిశ్చయించుకున్నాడు. లక్ష్మి జీవితచరిత్ర అంతా విన్నాడు. రామలింగం మనస్సు మార్చాలనుకొన్నాడు. మర్నాడే వూళ్లో కార్మికసంఘం ఏర్పరచాలనుకొన్నాడు. లక్ష్మికి ఒకరూపాయి యిచ్చాడు.

# గృహలక్ష్మి

లక్ష్మి ఆ సేట్ పులినోటినుంచి తప్పించుకుని యింటికి వచ్చింది. ఆమె వీధిలో తినుబండారములు కొనటం రామలింగం చూశాడు. ఇంటికి రాంగానే ఆ డబ్బు గుంజాలనుకున్నాడు. సాయంత్రంకాగానే యింటికివచ్చి లక్ష్మిని డబ్బియ్యమన్నాడు. లక్ష్మి 'డబ్బెక్కడి'దంది. రామలింగం వళ్లు మండింది. లక్ష్మి వీపుమీద దభీదిభీమని దెబ్బలుపడ్డయి. ఆమె సొమ్మసిలిపడిపోయింది. ఆ సమయంలోనే సూర్యారావు ఆ రామలింగానికి హితబోధచేసి అతన్ని సన్మార్గంలో పెట్టడానికి అక్కడికి వచ్చాడు. అంతట్లోకే ఆక్రందనాలు విని అక్కడికందరూ జేరారు. వాళ్లందరిముందూ నిలబడి సూర్యారావు గంటసేపు ప్రబోధం చేశాడు. సూర్యారావంటే త్రాగుబోతు కాకముందు రామలింగానికి భక్తిగౌరవాలుండేవి. అవి మళ్లీ రేకెత్తినయి. అతని హితోపదేశంతో రామలింగం మనస్సు తిరిగిపోయింది. సూర్యారావు అందర్నీ కార్మికసంఘంలో జేరి సంఘీభావం ఐకమత్యం పెంపొందించుకుని సన్మార్గంలో బ్రతకమని హితబోధ చేశాడు. తానప్పటినుంచీ కార్మికజనసేవకున్నాననీ తనవల్ల ఏ సహాయం కావలసినా ఏ కార్మికుడయినా పొందొచ్చుననీ వెల్లడించాడు. అందరూ సూర్యారావుకూ జై, కార్మికోద్యమానికీ జై అని అరిచారు.

క్రమక్రమంగా ఆపూరిలో కార్మికోద్యమం సూర్యారావు నాయకత్వంక్రింద బలవత్తరమయిపోయింది. చివరకు కార్మికుల రక్తమాంసాలు కలుస్తున్న బైరాంపా మిల్లులో సమ్మె చేయించాడు సూర్యారావు. సమ్మె అతని నాయకత్వంక్రింద అతీ జయప్రదంగా సాగుతోంది. లక్ష్మి రామలింగం అతని కుడియెడమల్లా పనిచేశారు.

*　*　*　*

అయిదు సంవత్సరాలు గడిచినయి.

ఒకప్పుడు అనాగరికత అనారోగ్యం తాండవించే ఆపురభాగం యిప్పుడు స్వర్గమయిపోయింది. విశాలమయిన బజార్లు, మంచినీళ్లకు బావులు, ఒక చిన్న తోట, ఒక పఠనాగారం, చిన్నబడి, ఆబడిలో పాఠాలు నేర్చుకుంటున్న కార్మిక బాలబాలికలు. అంతా సుందరమే! అంతా ఆనందమే.

సూర్యారావు తన ఆస్తిఅంతా ఖర్చుచేసి ఆకార్మిక నగరం కట్టించాడు. అతని కా నగరంచూస్తే బ్రహ్మానందం అయ్యేది.

ఆరోజు కార్మికసమితి వార్షికోత్సవం. సూర్యారావు ఊరేగింపు నడుపుతున్నాడు. అందరూ జాతీయగీతాలు పాడుతున్నారు.

లక్ష్మి 'ఇదంతా నీ మహాత్యం అన్నయ్యా!' అంది.

కాదు లక్ష్మి! దీనికంతటికీ కారణం నువ్వానాడు పొందిన అపకారం. ఆమర్నాడు నువ్వు తిన్న దెబ్బలు' అన్నాడు సూర్యారావు.

"అవును. కొందరు వ్యక్తులు అవమానం అపకారం పొందితేనేకాని యిల్లాంటి ఉద్యమాలు రావు" అన్నది లక్ష్మి ఆలోచనా, అంగీకారమూ తెల్పే కంఠంతో.